


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

OCTOBER-2013

సంవత్సర చందా రు.50/-

# బైబిల్ లెక్చర్‌షిప్

## BIBLE LECTURESHIP, KAKINADA

సమయం : **2013 నవంబరు6,7,8 తేదీలు**
ఉదయం 10:00 గంటలకు.
మధ్యాహ్నం 3:00 గంటలకు.
సాయంత్రం 6:00 గంటలకు.

స్థలం : **సత్యవాణి - క్రీస్తుసంఘము**
7-9-35 సాంబమూర్తి వీధి
కుళాయిచెర్వు ఎదురుగా
కాకినాడ-533 004.

ప్రసంగీకులు : **క్రీస్తుసంఘము**లో పేరు గాంచిన ప్రఖ్యాత అంతర్జాతీయ సువార్తికులు మరియు స్వదేశ సువార్తికులు.

వసతి,భోజనము : ఉచితము;మొదట్లో 20/- రూ॥లు రిజిస్ట్రేషన్‌ఫీజు చెల్లించవలెను.

**మీరు కుటుంబ సమేతముగా రావచ్చును. దారిఖర్చులు ఎవరికి వారే భరించవలెను.మీరు వచ్చి ఆత్మీయముగా మేలు పొందండి.అందరికి ఆహ్వానము!అందరికిస్వాగతము!!**

ఫోన్:0884-2363722
-2363697

వందనములతో
**రిక్కీగూటం**
**జాషువాగూటం**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | అక్టోబర్ - 2013 | సంచిక - 3


## పాతబావులను తిరిగి త్రవ్వుట
## (Re-digging the Old Wells)

అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు జీవితములో ఒక ప్రాముఖ్య సంఘటన జరిగెను. 21 వ శతాబ్దములో యున్న మనకు అది ఒక మంచి పాఠమును నేర్పుచున్నది. ఆసంఘటన బైబిలునందు ఆదికాండము 26:12–18లో వ్రాయబడి యున్నది. దానిని ఇప్పుడు చదువు కొందము: "ఇస్సాకు ఆ దేశమందున్నవాడై విత్తనమువేసి ఆసంవత్సరము నూరంతలు ఫలము పొందెను. యెహోవా అతనిని ఆశీర్వదించెను గనుక ఆమనుష్యుడు గొప్ప వాడాయెను. అతడు మిక్కిలి గొప్పవాడగు వరకు క్రమక్రమముగా అభివృద్ధి పొందుచు వచ్చెను. అతనికి గొర్రెల ఆస్తియు, గొడ్ల ఆస్తియు, దాసులు గొప్ప సమూహమును కలిగినందున ఫిలిష్తీయు లు అతనియందు అసూయపడిరి అతని తండ్రియైన అబ్రహాము దినములలో అతని తండ్రి దాసులు త్రవ్విన బావులన్నిటిని ఫిలిష్తీయులు మన్ను పోసి పూడ్చి వేసిరి.... ఇస్సాకు అక్కడనుండి వెళ్ళి గెరారు లోయలో గుడారము వేసికొని అక్కడ నివసించెను. అప్పుడు తన తండ్రియైన అబ్రహాము దినములలో

త్రవ్విన నీళ్ళ బావులు ఇస్సాకు తిరిగి త్రవ్వించెను; ఏలయనగా అబ్రహాము మృతినొందిన తరువాత ఫిలిష్తీయులు వాటిని పూడ్చి వేసిరి. అతడు తన తండ్రి వాటికి పెట్టిన పేళ్ళ చొప్పున తిరిగి వాటికి పేళ్ళు పెట్టెను".

ఫిలిష్తీయుల రాజైన అబీమెలెకు దేశములో గెరారు లోయలో మనము చదువుకొనిన సంఘటన జరిగెను. అబ్రహాము ఇదివరకు ఈలోయలో జీవించెను. అతని కుమారుడైన ఇస్సాకు అక్కడ నివసించునరికి అబ్రహాము త్రవ్వించిన బావులన్నియు ఫిలిష్తీయులచే పూడ్చివేయబడెను. అయితే ఇస్సాకు అతని గొర్రెలకు గొడ్లకు నీరు లభించునట్లు పూడ్చివేయబడిన నీళ్ళబావులను తిరిగి త్రవ్వించెను. అంతే కాదు అతని తండ్రి ఆబావులకు ఏయే పేర్లు పెట్టెనో ఆ పేర్లను అతడు తిరిగి వాటికి పెట్టెను.

సమస్తప్రాణులకు నీరు అత్యవసరము. నీరు లేకుండా మనము ఎక్కువ కాలము జీవించలేము. మన భౌతిక జీవనము కొరకు నీరు ఎంత ప్రాముఖ్యమో అట్లే ఆత్మీయ జీవనమునకు యేసుక్రీస్తు ఇచ్చు జీవజలములు అంత అవుసరము. సుఖారను ఊరిలో యాకోబు బావి వద్ద యేసు ఒక సమరయస్త్రీతో మాట్లాడుచు, "నేనిచ్చు నీళ్ళుత్రాగువాడు ఎప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్ళు నిత్యజీవనమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా యుండునని" చెప్పెను (యోహాను 4:14). కాలము గడచు కొలది నీటిబావులు చెత్త చెదారము వలన పూడ్చి వేయబడును. అట్టి బావుల లో నీరు సమృద్ధిగా ఉబుకునట్లు వాటిని మరల త్రవ్వించుట అత్యవుసరము. అట్లే ఆత్మీయ బావులు కూడాను. కాలము గడచు కొలది భక్తిహీనత వలనను, అబద్ధబోధకుల వలనను అవి పూడ్చివేయబడినవి. వాటిని ఇస్సాకువలె తిరిగి త్రవ్వుట అత్యవుసరము.

అపొస్తలులు చనిపోవకముందే దేవుని సత్య ఊటల బావులను పూడ్చి వేయుటకు మానవులారంభించిరి. క్రీస్తు సంఘము స్థాపింపబడగానే, మోషే ధర్మశాస్త్రమునకు క్రీస్తు సువార్తకు గల వ్యత్యాసమునెరుగని బోధకులు అసత్య సిద్ధాంతములను బోధించుచు సత్య బావులను కలుషితము చేయనారంభించిరి. ఆ బావులలో నున్న పనికిమాలిన బోధలను ఎత్తి చూపించుచు అపొస్తలులు మొదటి శతాబ్దములో సేవ చేసిరి. యూదా మతములో నుండి క్రైస్తవులయిన కొందరకు ధర్మశాస్త్రము మోషేవలనను, కృపయు, సత్యములు క్రీస్తువలనను కలిగెను సంగతి గ్రహించుకొనుట కష్టతరముగా యుండెను. అందు వలన క్రైస్తవులు కూడ మోషే ధర్మశాస్త్రమును

పాటించవలెనను అసత్యసిద్ధాంతమును వారు ఆనాడే బోధింపనారంభించిరి.

అదే బోధను ఈ 21వ శతాబ్దములో కూడ మనము కనుగొనుచున్నాము. ప్రొటెస్టాంటు డినామినేషన్లన్నియును మనము పాతక్రొత్తనింబంధనలను బట్టి పరిపాలింపబడుచున్నామని బోధింతురు. అయితే పాత నిబంధన చదువబడునప్పుడు, అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక ఆ ముసుకే నిలిచి యున్నది (2 కొరింథీ 3:14). మన మింకను పాతనిబంధన క్రింద యున్నామని చెప్పు అబద్ధ బోధను క్రైస్తవ్యములో నుండి మనము త్రవ్వి బయట పడవేయవలసి యున్నది.

యేసుక్రీస్తు యొక్క అపొస్తలులు యెరూషలేము నుండి యూదయ, సమరయ ప్రాంతములకు, చివరకు భూదిగంతముల వరకు సత్యసువార్తను చాటించుటలో సఫలులైరి. నిజ దేవుని గూర్చిన సత్యమును దేవతార్చనలు చేయు ప్రజల మధ్య వారు చాటించిరి. క్రీస్తు సంఘములను స్థాపించిరి. దేవతార్చనలు చేయు ప్రజల మధ్య సత్యము నాటబడిన వెంటనే, వారి మధ్య నున్న వ్యర్థాచారముల వలన అసత్యము పూడ్చబడుట ఆరంభమైనది. సత్యసంఘములో ప్రవేశించిన దేవతార్చనలు చేయు ప్రజల లోనుండియే రోమన్ కేథలిక్కులు ఉద్భవించిరి. కేథలిక్కుల అనేక అసత్య సిద్ధాంతముల వలనను, పూజలు పునస్కారముల వలనను సత్యజలముల బావులు మనము గుర్తించలేనంత రీతిగా పూడ్చివేయబడినవి. క్రొత్తనిబంధన ప్రకారము ప్రతి స్థానిక క్రీస్తుసంఘము క్రీస్తునందు పెద్దలు, పరిచారకుల వలన స్వయంపాలన కలిగి స్వతంత్రురాలై యుండగా, కేథలిక్కు సంఘము 'పోపు' అను గొప్ప నియంతను లేవదీసి లోకమందున్న సంఘములపై అతని అధిపతిగా నియమించెను. అతిత్వరలో మానవ కల్పిత సిద్ధాంతముల వలన సూక్ష్మమైన క్రొత్తనిబంధన సత్యములు కప్పి వేయబడెను.

దేవుని సత్యవాక్కు ప్రకారము విశ్వసించి మారుమనస్సు పొందినవాడు, రక్షింపబడు నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16). అయితే కొద్దిదినములలోనే బాప్తిస్మము ఒక సంస్కారముగా చేయబడెను. విశ్వసించిన వారికి బదులు విశ్వాసములేని పసిపిల్లలకు బాప్తిస్మమిచ్చు ఆచారము ఆరంభించబడెను. నీటిలో ముంచడమునకు బదులు చిలకరింపు అమలులోనికి వచ్చెను. అందుకే బాప్తిస్మమును గూర్చిన సత్యమును బైబిలునుండి ఎత్తి చూపించుచు క్రీస్తుసంఘములు దీని విషయమైన బావులను తిరిగి త్రవ్వుచున్నారు.

దేవుని సత్యవాక్కు ప్రకారము ప్రభురాత్రి భోజనమును ప్రతి క్రైస్తవుడు ప్రతి ఆదివారమున యేసుక్రీస్తు జ్ఞాపకార్థము నిమిత్తము చేయవలసి యున్నది. అందున్న రొట్టె క్రీస్తు శరీరమునకు గురుతుగాను ద్రాక్షరసము ఆయన రక్తమునకు గురుతుగాను ఈయబడెను. దీనిని గూర్చిన సత్యమును కేథలిక్కులు మార్చివేసి రొట్టె క్రీస్తు శరీరముగాను, ద్రాక్షారసము ఆయన రక్తముగాను మారునను అబద్ధ బోధను ప్రవేశపెట్టిరి. అందువలన ప్రభురాత్రి భోజనమును గూర్చిన అబద్ధబోధను మనము దేవుని రాజ్యమునుండి త్రవ్వి బయట పారవేయవలసి యున్నది. అట్లే ఆరాధనలో వాయిద్యములను, రకరకాల విగ్రహములను, సాంబ్రాణి పొగలను, బోధకులు ధరించుకొను విచిత్ర అంగీలను దేవుని సత్యవాక్య శత్రువులగు ఫిలిష్తీయులు ప్రవేశపెట్టిన చెత్త అని యెంచి వాటిని బయట పారవేయవలెను.

జ్వింగ్లీ, జాన్‌హస్, జాన్ కేల్విన్, మార్టిన్ లూథరు లాంటి వేత్తలు నాయకులుగా వచ్చుసరికి బావులన్నియు మానవ కల్పిత సిద్ధాంతముల వలన పూడ్చివేయబడెనని వారు గమనించిరి. దేవుని సత్యజల బావులనుండి ప్రజలు జీవ జలములు పొంది తమ ఆత్మీయ తృష్ణను తీర్చుకొనలేక పోవుచుండిరి. ఈ మత నాయకులు, మరికొందరు తమ జీవితములను వెచ్చించి దేవుని సత్యబావులను తిరిగి త్రవ్వుటలో కొంత మట్టుకు సఫలులైరి.

అయితే 19వ శతాబ్దము నుండి అపొస్తలులు త్రవ్విన బావులనే తిరిగి పూర్తిగ త్రవ్వుటకు ప్రజలు పూనుకొనిరి. అందు వలన ప్రపంచమందంతటా క్రొత్తనిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించుట అత్యవసరమని ప్రజలు గ్రహించిరి. ఈ ప్రజలు బైబిలు ఎక్కడ మాట్లాడునో అక్కడ మేము మాట్లాడుదుము. ఎక్కడ మౌనియగునో అక్కడ మేము మౌనులగుదుము అని ప్రకటించిరి. ఈ పునరుద్ధరణోద్యమము ఇప్పుడు లోకమందంతటా కొనసాగుచున్నది. అబద్ధబోధ వలన కప్పబడిపోయిన ఆత్మీయ సత్యములను త్రవ్వి ప్రజలకు ధైర్యముగా అందించుట జరుగుచున్నది.

ఇస్సాకు తన తండ్రి తవ్విన బావులను తిరిగి త్రవ్వుటయే గాక ఆబావులకు తన తండ్రి పెట్టిన పేళ్ళనే అతడు పెట్టెనని మనము చదివి యుంటిమి. ప్రపంచమందంటాయున్న క్రీస్తుసంఘములు అందుకే బైబిలు సంగతులను బైబిలు పేర్లతోనే పిలుచుట మీరు గమనించే యుంటారు. సత్య సువార్తను ప్రకటించుటతోడనే మనము సంతృప్తిజెందరాదు గాని బైబిలు ఏయే

సంగతులను ఏయే పేర్లతో పిలుచుచున్నదో అట్లు పిలుచుట కూడ అత్యవసరము.

క్రీస్తు సంఘముల విజ్ఞాపన ఇదియే! మతశాఖలను విడనాడండి! సత్యమును గ్రహించి దానికి లోబడండి! క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించండి !!

మిత్రుడా, నీవు ఈనాడేమై యున్నావు? నేను ఫలాని రకమైన క్రైస్తవుడనని చెప్పుకొనుచున్న యెడల పూడ్చి వేయబడిన నూతిలో ఇంకనూ నీవున్నావు. ప్రభువు స్థాపించిన సంఘములోగాక మానవకల్పితశాఖలో ఉన్న యెడల పూడ్చి వేయబడిన నూతిలో నీవున్నావు. సరిగదా, పరలోకమందున్న నాతండ్రి నాటని ప్రతిమొక్కయు పెల్లగింపబడునని క్రీస్తు మత్తయి 15:13లో చెప్పెను గనుక ప్రమాదకరమైన ప్రదేశములో నీవున్నావు.

యోగ్యమైన మంచి మనస్సుగల ప్రతివానితోను మేము చేయు విజ్ఞాపన యిదే: క్రీస్తును నమ్మండి, బాప్తిస్మము పొందండి. ఆయన సంఘము ద్వారా పనిచేస్తు సత్యమును పునరుద్ధరించండి!!

## వలను గూర్చిన ఉపమానము
## (The Parable of the Net)
### మత్తయి 13:47-50

**పరిచయము:**

యేసు ఈ ఉపమానములో చెప్పిన ఉదాహరణ చేపలుపట్టు జాలరుల యొక్క వృత్తిని జ్ఞాపకము చేయుచున్నది. జాలరుల పనిని గూర్చి అక్కడ అందరు ఎరిగియున్నవారే. గలిలయ సముద్ర తీరముననున్న కపెర్నహూము పట్టణములో యేసు ఈ ఉపమానము చెప్పారు. జనసమూహము మాత్రము సరస్సు ఒడ్డుననిలిచి యేసుమాటలు వినుచుండిరి. వలను గూర్చిన ఉపమానము యేసు తన అపొస్తలులకు చెప్పెను. వారిలో పెక్కుమంది జాలరులే (లూకా 5:1-11). వారు తమ దోనెలలో యుండి చేపలు పట్టుచుండగా యేసువారిని పిలిచెను. "ఇప్పటినుండి మీరు మనుష్యులను పట్టువారై యుందురని" ఆయన వారికి చెప్పెను (లూకా 5:10).

యేసు చెప్పిన వల ఒక పెద్దవల. అంచుల చివర అది బరువుగా యుండును. నీటిలో వేయబడగానే ఆ బరువుతో అది నీటిలో త్వరగా మునుగును. ఆ వలపై భాగములో నీటిలో తేలునట్లు బెండ్లు ఉండును. అది నీటిలో వేయబడగా

బహుశా ఒక అరమైలు మట్టుకు వ్యాపించి యుండును. దాని చివరలు దగ్గరకు చేర్చగా ఆ విస్తీర్ణములో యున్న చేపలు పట్టుబడును. గనుక వలను దరికి చేర్చ గానే పనికి వచ్చే చేపలను ఎంచుకొని మిగతా వాటిని విసర్జించేవారు.

**ఉపమానము :**

వలను గూర్చిన ఉపమానము గురుగులను గూర్చిన ఉపమానము యొక్క వరుసలో చేర్చవచ్చును. ఈ రెంటికి కొన్ని సారూప్యములున్నవి.

**గురుగులు** : యేసు శిష్యులు గురుగులను గూర్చిన ఉపమానభావము నడుగగా యేసు ఇట్లు చెప్పెను, "మంచి విత్తనము విత్తువాడు మనుష్య కుమారుడు, పొలములోకము ; మంచి విత్తనములు రాజ్యసంబంధులు, గురుగులు దుష్టుని సంబంధులు; వాటిని విత్తిన శత్రువు అపవాది; కోత యుగసమాప్తి ; కోత కోయువారు దేవదూతలు. గురుగులు ఏలాగు కూర్చబడి అగ్నిలో కాల్చి వేయ బడునో ఆలాగే యుగసమాప్తి యందు జరుగును. దేవదూతలు వచ్చి నీతిమంతు లలోనుండి దుష్టులను వేరుపరచి వీరిని అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును" (మత్తయి 13:47–50).

యివి రెండును రాజ్య ఉపమానములు మాత్రమే కాదు అవి తీర్పు ఉపమానములు కూడాను. గురుగులను గూర్చిన దానిలో యేసు దుష్టులను గూర్చియు, వారి నిత్య నాశనమును గూర్చియు వక్కాణించెను. ఈరెండు ఉపమానములలోను దూతలు దుష్టుల విషయములోనే వినియోగింప బడిరి. యేసు చెప్పిన ఉపమానములలో వాటియొక్క భావాన్ని గూర్చి కొంత అవగాహన కల్పించారు. దానిలోని ప్రతి అంశమును ఆయన వక్కాణించలేదు. గాని ఆ ఉపమానము యొక్క ప్రయోజ నాన్ని నొక్కి చెప్పారు. మనం కూడ అట్లే చేయాలి.

వలను గూర్చిన ఉపమానములో మంచి వారిని చెడుగువారిని వేరు చేయుట జరుగును. దీనిలో రాజీపడే స్థితియేదీ లేదు. యేసు చెప్పిన అనేక ఉపమానములో ఈరెండు స్థాయిల వేర్పాటు కనబడును.

గురుగులను గూర్చిన దానిలో గోధుమలు గురుగులు వేరు చేయబడును. వల విషయంలో మంచి చేపలు చెడ్డ చేపలు వేరుచేయబడెను. పెండ్లి విందును గూర్చిన ఉపమానములో పెళ్లి వస్త్రము ధరించు కొననివాడు మిగతా అతిథులతో వేరుచేయబడెను. గృహయజమానిని గూర్చిన ఉపమానములో మంచి చెడ్డ దాసుల మధ్య వేర్పాటు సంభవించెను. పదికన్యకల ఉపమానములో తెలివిగల

వారినుండి తెలివిలేని కన్యకలు వేరుచేయ బడిరి. తలాంతుల విషయంలో లాభము సంపాదించిన దాసులనుండి, నష్టము చేసిన వాడు వేరుచేయబడెను. గొర్రెలు మేకలను గూర్చిన ఉపమానములో వేటికవే వేరు చేయబడెను.

వలను గూర్చిన ఉపమానము పెండ్లి విందును గూర్చిన ఉపమానము వలె యున్నది. మత్తయి 22:10లో "ఆదాసులు రాజమార్గములకు పోయి చెడ్డవారినేమి మంచివారినేమి తమకు కనబడినవారి నందరిని పోగుచేసిరి. వలవేసిన వారు తమవలలో పడిన మంచి చేపలను, పనికిరాని చేపలను కూడా పోగుచేయుదురు. అన్నిరకాలైన మనుష్యులకు సువార్త బోధింపబడుచున్నది. వారు మనయెదుట నున్న సంఘములలో దర్శనమిత్తురు.

మంచి చేపలు, చెడ్డ చేపలవలె సంఘములో సభ్యులుగా మంచివారు చెడ్డవారు కూడ యుందురు. గోధుమలు గురుగులతోఈ చేపలు పోల్చబడ వచ్చును. ఒకానొక సమయమందు వారు వేరు చేయబడుదురు.

వల వేయబడిన సముద్రము లోకమునకు సాదృశ్యముగా యున్నది. వల అయితే క్రీస్తు రాజ్యమైన సంఘమునకు గురుతుగా యున్నది. మంచి, చెడు చేపలు క్రైస్తవులు. వలలు వేయువారు ఆత్మలను సంపాదించు క్రైస్తవులు. ఒడ్డు తీర్పునకు సాదృశ్యము. చేపలను వేరుచేయువారు దేవుని దూతలు. మంచి చేపలుంచబడిన గంప పరలోకము. పనికిమాలిన చేపలు పడవేయబడిన ప్రదేశము నరకము.

పెద్దవల సువార్త వ్యాప్తి కొరకు మానవుని ప్రయత్నమై యున్నది. సంఘాభివృద్ధి విషయంలో మానవుని పాత్రను అపొస్తలుల కార్యముల గ్రంథము చారిత్రాత్మకముగా వివరించుచున్నది. మానవులకు దేవుని వర్తమానము నందించు విషయంలో, నేరుగా దేవుడే గాక బోధకులు, ఉపదేశకుల ద్వారా అది జరుగువలెనని సంకల్పించారు (రోమా 10:13-18; 2 పేతురు 1:20-21). ఈ ఉపమానములో వలవేయుజాలరులు క్రైస్తవులు: క్షమాపణ నొందినవారందరు మనుష్యులను పట్టు జాలరులుగా యుండవలెను, ఆత్మలను దేవుని కొరకు సంపాదించవలెను.

తనలోపడే చేపలను గూర్చి వల ఎట్లు వివక్షత చూపదో అట్లే సువార్త చాటుటలో మనం ఎవరికీ వివక్షత చూపరాదు. భూమిమీదయున్న క్రీస్తు సంఘములో నీతిమంతులు, నమ్మకముగా లేని క్రైస్తవులు కూడ యుంటారు. దేవుడే తన రాజ్యమునుండి అనీతిమంతులను వేరుచేయును.

అవును, సంఘములో వేషధారులు

న్నారు. ఒకడు క్రైస్తవుడైన తరువాత పాపములోబడి నాశనమవచ్చును. అక్రమంగానడుచుకొను వారిని గూర్చి లేఖనముల ప్రకారము సంఘము క్షమ శిక్షను అమలుచేయు బాధ్యత గలది (2 థెస్స 3:6,14).

దేవుడు తీర్పుసమయంలో యేమీ పొరబాట్లు చేయరు. ఒకడు కూర్చొని అయా గంపలలోనికి చేపలను ఎట్లు వేరుచేయునో దేవుడు కూడ జనులను అట్లు వేరు చేయును. అనాలోచితముగా ఆయన యేమీ చేయరు (మత్తయి 7:21-23). వేర్వేరు గంపలు పరలోకము నరకాన్ని ఎట్లు సూచించునో, పరలోకము గోధుమలు కూర్చబడు కొట్టువలె (మత్తయి 13:30), అనేక నివాసములవలె (యోహాను 14:2) నిత్య నివాసము వలె (లూకా 16:9), పట్టణము వలె (హెబ్రీ 11:10; 12:22; ప్రక 3:12; 21: 22) వర్ణించబడినది.

అదే రీతిగా నరకాన్ని వర్ణించు అనేక పదములు లేఖనములలో మనకు కనబడును : అగ్నిగుండము (మత్తయి 13:50), నిత్యశిక్ష (మత్తయి 25:46), నిత్యాగ్ని (మత్త 26:41; ప్రక 21:8) అగ్ని అరని పురుగుచావని స్థలము (మార్కు 9:43-48), వెలుపటి చీకటి (మత్త 25:30), నిత్యనింద (దానియేలు 12:2), నిత్య ఎడబాటు స్థలము (2 థెస్స 1:6-9), అపవాదికిని హాని దూతలకును సిద్ధపరచబడిన స్థలము (మత్తయి 25:41).

**ముగింపు :**

ఉపమానములు క్రొత్త సిద్ధాంతమునేదీ బోధించవు. బైబిలులో కనబడు బోధనే అవి చిత్రీకరించి విశదీకరించును. ప్రభువు యొక్క రాజ్యమునందు మనము సరిగ అర్థము చేసికొనుటకు ఈ ఉపమానములు మనకు సహాయపడును. సువార్త, క్రీస్తు రాజ్యము మానవులందరికీ వర్తించును. అయినను దానిలో ప్రవేశించు వారు కొందరే. రాజ్యములో యున్న వారు యితరులను దానిలోనికి ఆకర్షించవలెను. తీర్పు వచ్చుచున్నది. కొందరు రక్షించబడుదురు. మరి కొందరు నశింతురు.

- లూయిస్ రష్మోర్

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/-రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# స్వార్థపరధనికులను దేవుడు ఖండించును
## (God Condemns the selfish Rich)

పరమందొక దేవుడున్నాడు అయినను ఆయన యందు కొందరు విశ్వసింపకున్నారు. ఎందువలన? రాజ్యాధికార శక్తులు తమ అధికారమును కొనసాగించుకొనుట కొరకు మతమును వాడుకొందురని వారికి చెప్పబడినందు నవారు విశ్వసింపకున్నారు. ఇది నిజమే అయితే దేవునియందు విశ్వాసముంచిన వారు దానిని ఒప్పుకోవాలి. అయితే దురభిమాన ద్వేషము వలన సత్యము విషయమై మనము అంధులము కాకూడదు. దేవునియందలి విశ్వాసము, క్రీస్తు యొక్క మార్గము అనుసరించుట వలన ధనికులకు సేవ చేయువారమగు దుమా? ప్రజలను వారు తమ స్వార్థ ప్రయోజనాల కొరకు వాడు కొందురా?

నీతిమంతులు ధనము నందు నమ్మిక యుంచరాదని హెచ్చరింపబడి యున్నారు:

ధనవంతుల ప్రయోజనాలను కాపాడుటకు బదులు, బైబిలు వారిని ఖండించుచున్నది. లూకా 6:24లో క్రీస్తు " అయ్యో ధనవంతులారా మీరు కోరిన ఆదరణ మీరు పొంది యున్నారని" ఖండించారు. "ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను అవివేక యుక్తములును హానికరము లునైన అనేక దురాశలలోపడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనము లోను ముంచి వేయును"అని 1తిమోతి 6:9 చెప్పుచున్నది. "ఇదిగాక ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుటకంటే సూది బెజ్జములో ఒంటె దూరుట సులభ మని" యేసు నిశ్చయముగా చెప్పెను (మత్త 19:24). "దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సంపాదించుకొను మని"బైబిలు హెచ్చరించుచున్నది. (1 తిమోతి 6:11).

దేవునియందు విశ్వాసము గల వారు ఇట్లు హెచ్చరింపబడియున్నారు : "ఇహమందు ధనవంతులైనవారు గర్విష్టులు కాక అస్థిరమైన ధనమునందు నమ్మిక యుంచక సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనము ధారళముగ దయ చేయు దేవునియందే నమ్మిక యుంచుడని ఆజ్ఞాపించుము. వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము, రాబోవుకాలమునకు మంచి పునాది తమ కొరకు వేసికొనుచు, మేలు చేయువారును

సత్క్రియలు అను ధనము గలవారును ఔదార్యము గల వారును, తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెనని వారికి అజ్ఞాపించుము" (1తిమోతి 6:17-19).

"తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారై యుండవలెనను" మాటను గమనించుము. ఇంకొక మాటలో ధన వంతుడైన వాడు తన సంపదను తన కొరకే దాచిపెట్టు కొనక లేని వారికి దానిలో పాలిచ్చువాడై యుండ వలెనని బైబిలు బోధించుచున్నది. "రెండు అంగీలుగలవాడు ఏమియు లేని వానికియ్య వలెనని" బాప్తిస్మమిచ్చు యోహాను బోధించెను (లూకా 3:11). ధనవంతుడొకడు యేసును వెంబడింపగోరగా, యేసు అతనితో "నీవు పరిపూర్ణుడవగుటకు కోరిన యెడల పోయినీ ఆస్తిని అమ్మిబీదలకిమ్ము, అప్పుడు పరలోక మందు నీకు ధనము కలుగును; నీవువచ్చి నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను" (మత్తయి 19:21). బైబిలునందలి ఈలేఖనములను బట్టియు, మిగతా వచనములను బట్టియు ధనవంతులను బైబిలు ప్రోత్సహించుట లేదుగాని తమ ధనమును ఇతరులతో పంచుకొనవలెనని అది బోధించుచున్నది.

బీధలను వాడుకొను ధన వంతులు ఖండింపబడ్డారు: ధన వంతులు ఖండించబడుటయే కాదు గాని తాము ధనవంతుల గుటకు బీదలను వినియోగించుకొను వారు ఖండించ బడ్డారు. "నీతి తప్పితన నగరును స్థాపించు వానికి శ్రమ, న్యాయము తప్పి తన మేడ గదులను కట్టించు కొనుచు జీతమియ్యక తన పొరుగు వాని చేత ఊరకనే కొలువు చేయించు కొను వానికి శ్రమ" (యిర్మియా 22:13).

"ఇదిగో ధనవంతులారా, మీమీదికి వచ్చెడి ఉపద్రవములను గూర్చి ప్రలాపించి యేడువుడి, మీధనము చెడిపోయెను, మీవస్త్రము లు చిమ్మటలు కొట్టిన వాయెను, మీబంగారమును మీ వెండియు తుప్పు పట్టినవి, వాటి తుప్పు మీ మీద సాక్ష్యముగా ఉండి అగ్నివలె మీ శరీరములను తినివేయును, అంత్య దినములయందు ధనము కూర్చు కొంటిరి. ఇదిగో మీచేలు కోసిన పని వారికియ్యక మీరు మోసముగా బిగబట్టిన కూలి మొర్ర పెట్టుచున్నది. మీకోతవారి కేకలు సైన్యములకు అధిపతియగు ప్రభువు యొక్క చెవులలో చొచ్చియున్నవి.

మీరు భూమి మీద సుఖముగా జీవించి భోగాసక్తులై వధ దిన మందు మీ హృదయములను పోషించుకొంటిరి" (యాకోబు 5:1-5).

ఈలేఖనములు స్వార్థపరుడైన ధనవంతుని ఖచ్చితముగా ఖండించు చున్నవి. బీదలకు అక్రమ కూలి నిచ్చు వాడు ఖండించబడియున్నాడు. "యజమానులారా, పరలోకములో మీకును యజమానుడున్నాడని యెరిగి న్యాయమైనదియు ధర్మాను సారమైనదియు మీదాసుల యెడల చేయుడి" యని కొలస్స 4:1లో చెప్పబడియున్నది.

ధనవంతులు బీదలను హింసిం చుటను దేవుడు ఖండించుచున్నట్లయితే, భక్తిగలవారు కూడ అట్లే ఎందుకు చేయుదురని నీవడుగవచ్చును. అయితే భక్తిగలవారమని చెప్పుకొనే వారందరు నిజదేవునియందు భక్తిగల వారుకారు. వారు సత్యవాక్యము ననుసరించరు. మతముపేరున గతంలో అనేక పవిత్ర యుద్ధములు జరిగినవి. వాటిలో వేల కొలది అమాయకులు నశించిరి, నిజానికి మతగురువులే యేసుక్రీస్తును సిలువ వేయించారు. మతము మంచి దయితే ఇదెందుకు జరిగినది? ఒకటి మనం జ్ఞాపకముంచు కోవాలి. సజీవుడగు దేవుడెట్లున్నారో, సజీవుడగు సాతాను కున్నాడు. వాడు ఆరంభములో మంచి దానిని చూచి దానిని పాడుచేసి తన క్రియనుసాధిస్తాడు. అపవాది మోస గాడు, అబద్ధికుడు. అందు వలన భక్తిగలవారిని తన సేవకులుగా వినియోగిస్తాడు.

భక్తిగల వారందరు క్రైస్తవులు కాదని మనము గుర్తుంచుకోవాలి. నిజక్రైస్తవునికి భక్తిగలవానికి చాల తేడా యున్నది. నిజక్రైస్తవుడు క్రీస్తు బోధిం చిన సూత్రమును, అనగా "పుచ్చు కొనుట కంటే ఇచ్చుట ధన్యము" అను దానిని పాటిస్తాడు (అపొ.కా.20:35). దేవుడు గర్విష్టులను ఎదిరించి దీనులకు కృప చూపునని బైబిలు బోధించు చున్నది. ధనవంతులను ప్రోత్సహించి హెచ్చించుటకంటే బైబిలు పడిపోయిన వారిని లేవదీయుచున్నది, బీదలకు ఆదరణ నిచ్చుచున్నది. కృంగిన వారిని లేవదీయుచున్నది. "ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు, పరలోక రాజ్యము వారిది" యని క్రీస్తు బోధిం చారు (మత్తయి 5:3).

– ఓటిస్ గేట్వుడ్

## నీవు తెలిసికొని చేయాలని దేవుడు కోరుచున్నది
## (What God wants You to Know and to Do )

"ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయునప్పుడు మిమ్మును శ్రమ పరచు వారికి శ్రమయు శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతి అనుగ్రహించుట దేవునికిన్యాయమే" (2థెస్స1:7-9).

సువార్తకు లోబడని వారు నిత్య దండన పొందుదురు గనుక సువార్త అనగా యేమిటో దానికిలోబడుట ఎట్లో ఒకడు తెలిసికొనవలెను.

**సువార్త అనగా**

అపొ.పౌలు సువార్త యేమిటో తెలియజేయుచున్నాడు. "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దాని యందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని నేను ఏ ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొని యున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణపొందు వారై యుందురు. నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీ 15:1-4).

మన పాపముల నిమిత్తము మనము పొందవలసిన శ్రమను యేసు భరించెను (యెషయా 53). అపొ. పౌలు ఇట్లు వ్రాసాడు: "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తునందు నిత్యజీవము" (రోమా 6:23). "ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా క్రీస్తు యుక్తకాలమున భక్తి హీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచి వాని కొరకు ఎవడైన ఒక వేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచు చున్నాడు, ఎట్లనగా మన మింకను పాపులమైయుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" (రోమా5:6-8).

**సువార్తకులోబడుట అత్యవసరమా ?**

సువార్తకు వెంటనే లోబడుటకు రెండు కారణములున్నవి. 1) జీవితం

అనిశ్చయం. జీవితం శాశ్వతం కాదని ప్రతిదినము మనకు జ్ఞాపకము చేయబడుచున్నది. అనారోగ్యము వలన గాని, ప్రమాదములవలన గాని అనేకులు మరణించుచున్నారు, "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆతరువాత తీర్పుజరుగును" (హెబ్రీ 9:27). 2) క్రీస్తు మరల ఎప్పుడు వచ్చునో ఎవరికి తెలియదు. (1థెస్స 5:2). ఆయన ఎప్పుడు వచ్చునో ఎవరికి తెలియదు.

**సువార్తను చెరుపువారిని గూర్చి జాగ్రత్త :**

సువార్తను చెరుపు వారిని గూర్చి అపొ.పౌలు ముందుగానే హెచ్చరించాడు. పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను శాపమునకు గురికాకుండా మార్చలేడని అతడు హెచ్చరించాడు (గలతీ 1:6-8).

**సువార్తకు ఎవరులోబడాలి?**

తిరిగి జన్మించాలని కోరుకొనే వారందరు సువార్తకు లోబడాలి. (యోహాను 3:3-5). పాపములోబడి నశించిన వారందరు సువార్తకులోబడాలి. యేసుక్రీస్తు తన రక్షకుడని మనసులో అంగీకరిస్తే సరిపోదు. విధేయతకు అదిలోపించినది.

చిలకరింపుపొందిన వారందరు బాప్తిస్మముపొందాలి. నిజమైన బాప్తిస్మము నీటిలో ముంచబడుట (రోమా 6:3-7); కొలస్స 2:12; యోహాను 3:23). సువార్త బోధింపబడగా విని, విశ్వసించి, మారుమనస్సు పొందదగిన వయస్సు గల వారందరు బాప్తిస్మము పొందాలి. పసి పిల్లలుగా యున్నపుడే, లేక వయస్సు వచ్చినప్పుడే చిలకరింపుపొందిన వారందరు ముంచడము పొందాలి.

క్రీస్తును హృదయములో అంగీకరించి, పాపిప్రార్థన చేయాలని చెప్పబడిన వారందరు బాప్తిస్మము పొందాలి. లూకా 18:3-14లో పరిసయ్యుడు సుంకరి చేసిన ప్రార్థనలను ఆధారముగా చేసికొని కొందరు ఆరకమైనప్రార్థనలు చేతురు. అయితే స్వనీతిని ఖండించుటకు యేసు ఆసంఘటనను గూర్చి చెప్పెను. గాని ఒకడు ఒకడు రక్షింపబడుట ఎట్లో అది చెప్పుటలేదు. బాప్తిస్మము పొందకుండా రక్షింపబడుదుమని చెప్పువారందరు సువార్తకు లోబడకుండా రక్షింపబడగలమని చెప్పువారగుదురు.

ప్రార్థనవలన రక్షింపబడుదుమని తలంచేవారందరు బాప్తిస్మము పొందాలి. క్రైస్తవుడు పాపము చేసినప్పుడు ప్రార్థించాలని చెప్పబడినది (యాకోబు 5:16; అపొ.కా. 8:22). అయితే సువార్తకు ఎన్నడులోబడని వాడు క్షమించబడునట్లు ప్రార్థించాలని వారికి చెప్పబడలేదు. (అపొ.కా. 2:38; మార్కు 16:16; అపొ.కా. 22:16).

సువార్తకు లోబడుట అత్యవసరము. దానికిలోబడక పోతేనిత్య నరకములో దండింపబడుదుము.

– కేటన్ పెప్పర్

## మనసాక్షి దేవుని వాక్యముచే నడిపించబడాలి
## (God's word should Guide the Conscience)

ఒకని మనస్సులోని సంగతులను ఆమోదించుటయో, ఖండించుటయో చేయు అతని అంతరాత్మ మనసాక్షి యగును. ఉపదేశము ద్వారా మనసాక్షి అభివృద్ధియగును. ఒకడు నేర్చుకొనిన దానిని బట్టి అతని భావములు, అంతరాత్మ వృద్ధియగును. ఒకడు అబద్ధమును విని యుండియు అదే నిజమని నమ్మినయెడల, అతని మన సాక్షి దానిని సత్యమని అంగీకరించును.

తన కుమారుడైన యోసేపు అడవి మృగము వలన చంపబడెనని యాకోబు యొక్క కుమారులు అతనికి తెలియజెప్పిరి. వారు చెప్పేది యాకోబు నమ్మునట్లు యోసేపు యొక్క అంగీని జంతు రక్తములో ముంచి అతనికి వారు చూపించిరి. యాకోబు వారి అబద్ధమును నమ్మెను. ఇరువది సంవత్సరములు మట్టుకు యాకోబు యోసేపు మృతి జెందెనని నమ్మెను. గాని యోసేపు జీవించియే యుండెను! అతడు ఐగుప్తులో నివసిస్తు గొప్పగా అభివృద్ధిజెందెను (ఆది 39-50 అధ్యా). యోసేపు నిజంగా మరణిస్తే ఎట్లుండునో అట్లే యాకోబు భావించాడు. అతడు అవాస్తవాలను విశ్వసించినందున అతని భావములు అతని మోసగించెను. తన కుమారులు చెప్పిన అవాస్తవములు నమ్మినందున అతని అంతరాత్మ అతని పెడద్రోవను పెట్టించెను.

అదే రీతిగా కొందరు తమ పాపముల నుండి రక్షింపబడకయే రక్షింపబడితిమని తలంచుదురు. బాప్తిస్మము పొందకయే గతపాపముల నుండి రక్షింపబడుదురు అని వారికి బోధించబడెను. దానిని వారు నమ్మినందున, మేము సురక్షితమేయని వారు తలస్తారు. ఆరీతిగా తమ మనసాక్షి వారిని మోసగించును. దేవుని వాక్యానికి అన్వయించిన బోధను వారు వినలేనందున వారు మోసగించబడుదురు. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్మువారు తమ పాపముల విషయమై మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందలెనని బైబిలు బోధించు చున్నది (అపొ.కా. 2:38). నీ మనసాక్షి దేవుని వాక్యము చొప్పున నడిపించబడును గాక !

- బేసిల్ ఓవర్టన్

# లేఖనముల అధికారము
## (The Authority of Scriptures)

బైబిలు యొక్క అధికారము అనే అంశము అన్నికాలములలోను చాల ప్రాముఖ్యమైనది. ఈయంశమును గూర్చి ఒకడు ఎట్లు నిశ్చయించుకొనునో దానిపై అతని ఆత్మీయ ఉనికి ఆధారపడి యున్నది. బైబిలు దేవుని అధికారమైతే ఒకని జీవితం ఎట్లు నడిపించబడునో నిశ్చయించబడును. లేఖనములకు భావార్ధము చెప్పుట, వివరించుట తదుపరి జరుగును నిజమే, అయినను అది దీనికి సంబంధించిన అంశమే. అయితే బైబిలు అధికారము లేకపోతే, అది చెప్పునది ప్రాముఖ్యము కాదు. అది కేవలం ఆసక్తిని మరియు పురాతన ఆసక్తిని రేపునది మాత్రమే యగును.

లేఖనములు దేవుని వాక్యమైయున్న వనే భావముతో మూడు ప్రాముఖ్య విధము లుగా బయలుపరచబడియున్నది. మొదటి గా అది దేవుడేనేరుగా మాటలాడుట వలన బయలుపరచబడెను. సృష్టిక్రమములో యిది మొదట బయలుపరచబడెను. దేవుడు కలుగునుగాకయని పలుకగా అది అట్లాయెను, సృష్టి జరిగిన ఆరుదినము లలోను ఆయన చెప్పిన మాట చొప్పున అయెను. దేవుని నోటనుండి వచ్చిన వాక్యము యొక్క అధికారము తిరస్కరింప బడనిది. ఇంతకుముందు లేని దానిని ఆయన ఉనికి కలిగియుండు దానిగా తన నోటిమాట చొప్పున చేసెను.

రెండవదిగా దేవుని వాక్యము శరీరాకారముగా ప్రత్యక్షమాయెను. "అవాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" అని యోహాను చెప్పెను (యోహాను 1:14). వాక్యమైన యేసుక్రీస్తు సంపూర్ణాధికారమునకు మాదిరియై యుండెను. దానిని ఆయన అనేక విధములుగా నిరూపించెను. ఆయన మాట పలుకగానే అపవిత్రాత్మలు ఆయనకులోబడెను (మార్కు 1:27). ఆయన భూలోక యాత్రముగియు సరికి "ఇహమందును పరమందును నాకు సర్వాధికార మీా యబడి యున్నది" యని చెప్పెను (మత్తయి 28:18).

మూడవదిగా, దేవుని వాక్యము లిఖితపూర్వకముగా మనకు ప్రత్యక్ష మాయెను. ఇక్కడ లేఖనములు దైవా వేశములనే ప్రాముఖ్యాంశమును గుర్తించవలసియున్నది. బైబిలు ఎక్కడ నుండి లేక ఎరికినుండి కలిగిన దోయను అంశమునకు దైవావేశము జవాబుగా యున్నది. అది దేవుని వలన కలిగెనా? లేకమానవుని వలన

కలిగెనా? దానిని నిరూపించుటకు ఈ వ్యాసము చాల సంకుచితమైనదే అయినను, లేఖనములు దైవావేశములని నమ్ముటకు చాలినంత ఆధారములున్నవని గ్రహించు కోవలెను. నిజానికి, బైబిలు లిఖితపూర్వక దేవుని వాక్యమని స్థాపించగలిగితే, అది దేవుడు నోటితో పలికిన మాటయని, శరీరాకారము దాల్చిన వాక్యమని, అధికార పూరితదైవ వాక్కు అని నిర్ధారణయగుచున్నది.

నిజానికి మనం అడుగవలసిన ప్రశ్న యేమంటే, మానవుడు దేవుని పరిపూర్ణ అధికారమునకు ఎప్పుడు విధేయుడవుతాడు? అతడు కావాలంటే ఈరోజే దేవుని వాక్యమునకు విధేయుడుకావచ్చును. తద్వారా వాగ్దానము చేయబడిన గొప్ప రక్షణను పొందవచ్చును, లేదా అతడు తీర్పు దినము వరకు కనిపెట్టుటకు నిశ్చయించుకొనవచ్చును (యోహాను 12:48). మనం ఆయనకు విధేయుల గుటకు ఎప్పుడు నిశ్చయించుకొనినను, ప్రతివాని మోకాలు ఆయన నామమున వంగుననియు, ప్రతి వాని నాలుక ఆయన నామమును ఒప్పుకొనుననియు లేఖనములు చెప్పుచున్నవి (రోమా 14:11).

– దేవిడ్ డిఫెన్‌బాగ్

## మేము యేసును చూడగోరుచున్నాము
## (We Wish to see Jesus)

"వారు గలిలయలోని బేత్సయినా వాడైన ఫిలిప్పునొద్దకు వచ్చి అయ్యా మేము యేసును చూడ గోరుచున్నామని అతనితో చెప్పిరి" (యోహాను 12:21).

వీరెవరు? వారు గ్రీసు దేశస్థులని 20వ వచనము చెప్పుచున్నది. పండుగలో ఆరాధించుటకు వచ్చిన వారిలో గ్రీసుదేశస్థులుండిరి. కొర్నేలీవలె వారును భక్తిపరులా ? యూదా మతమునంగీకరించిన గ్రీకులా? లేఖనము మనకు చెప్పుటలేదు. బహుశవారు ఆసక్తిపరులేమో. ప్రభువు చేయుచున్న గొప్ప పనులను గూర్చి బహుశవారు వినియుండిరి, ఆయనను చూరగోరిరి.

వారు సరియైన వ్యక్తిని చూడ గోరుచున్నారా ? అవును, అవును !! వారు సరియైన చోటికే వచ్చారు. మన ఉద్యోగాలు ప్రాముఖ్యమే. గాని అవి యేసు కంటె ప్రాముఖ్యము కాదు. అన్న వస్త్రములు, వసతి అవసరమే. గాని యేసును చూచుట అత్యంత ప్రాముఖ్యము. నీవు భారత రాష్ట్రపతిని దగ్గరగా ఎప్పుడైనా చూచావా?

ఆయనను చూచినవారు చాల అదృష్ట వంతులమను కొంటారు. గాని ఈలోక నాయకులందరికంటే యేసును చూచుట ఒక గొప్ప అదృష్టము. నీవాయనను రక్షకునిగా ఎన్నడైనా చూచావా? ఆయనను మెస్సీయగా, క్రీస్తుగా చూచావా? ఆయనను సంఘ శిరస్సుగా ఎన్నడైనాచూచావా! నీజీవిత ప్రభువుగా ఆయనను చూచావా?

నీవు నేను ఆయనను ఎక్కడ చూడగలము ? లేఖనములలో ఆయనను మనము చూడగలము. పెంతెకొస్తునాడు పేతురు చేసిన ప్రసంగమును జాగ్రత్తగా చూడుము. సమస్య యేమంటే అతి తక్కువ మంది లేఖనములు మనకు బోధించు నట్లు అంగీకరింతురు. రాబోవు మెస్సీయా ను గూర్చి పాతనిబంధన విపులముగా బోధించుచున్నది. (యెషయా 53). సిలువ వేయబడిన క్రీస్తును బోధించుట ద్వారా అపొ. పౌలు అనేకులు యేసును చూచునట్లు చేయగలిగాడు.

క్రైస్తవుల జీవితాలలో మనము యేసును చూడవచ్చును. అపొ.పౌలు ఇట్లు వ్రాసాడు : " నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను; ఇకను జీవించువాడను నేను కాదు, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి నాకొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2:20).

నీవుగ్రీసు దేశస్థులవలె యేసును చూడ గోరుచున్నావా? అయితే నీ బైబిలును తెరచి యేసును గూర్చి దానిని నీకు చూపించనిమ్ము. ఎవరైనా బోధకు లు నీయింటికి ప్రతివారము వచ్చి యేసును గూర్చి నీకు తెలియజేయ నిమ్ము. ప్రతి బైబిలు క్లాసుకు, ఆరాధనకు హాజరుకమ్ము. క్రీస్తుసంఘారాధనలలో హాజరగుటకు ఎన్నడు వెనుకాడవద్దు. భక్తిపరులైన స్త్రీ పురుషుల జీవితములలో యేసును చూడుము. కొంత కాలానికి ఇతరులు కూడ నీజీవితంలో యేసును చూడ గల్గుదురు !

– లోయ్ మిచ్చెల

# గలిలయ నుండి యొర్దానుకు
## (From Galilee to the Jordan)

"ఆసమయమున యోహాను చేత బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయ నుండి యొర్దాను దగ్గరనున్న అతని యొద్దకు వచ్చెను" (మత్తయి 3:13). —

యేసు యొక్క మాదిరి మనకు అత్యంత ప్రాముఖ్యమైనది. ఆయన దేనికి ప్రాధాన్యత యిచ్చెనో దానిని గమనించి అనుకరించాలి.

యొర్దాను నది చాల పొడ వైనది. పాలస్తీన అంతా అది వ్యాపించి యున్నది. అది హెర్మోను కొండలపై మొదలిడి మృత సముద్రము వరకు 156 మైళ్ళ పొడవున్నది. నజరేతునుండి యోహాను బాప్తిస్మమిచ్చుచున్న స్థలముకు ఇంచుమించు 60 మైళ్ల దూరము న్నది. ఈ దూరమంతయు కాలినడకనే చేరుకొనవలెను. ఆరోజులలో యూదులు సమరయ గుండా వెళ్లకుండుటకు యొర్దాను దాటి దాని తూర్పువైపున ప్రయాణం చేసే వారు. యేసు కూడ ఈ దారినే ఎంచుకొనెనో లేదో మనకు తెలియదు. బాప్తిస్మమిచ్చు యోహాను అద్భుతములు యేమిచేయలేదు. అయినను యేసు సమయమును, శక్తిని, సౌకర్యములను ఎంచక ఇంత కష్టతరమైన ప్రయాణము చేసెను (యోహాను 10:40, 41). యోహాను యొక్క పేరు ప్రఖ్యాతులను బట్టి యేసు అతని యొద్దకు రాలేదు. మరియు ఆయన జనసమూహమును వెంబడించలేదు!

యోహాను చేయుచున్న దేమిటో, దానిని బట్టి యేసు అతని వైపు ఎందుకు వచ్చారో ఆలోచింతము. అతడు బాప్తిస్మమిచ్చు వాడని గుర్తింపు పొందెను. అందుకే అతడు బాప్తిస్మమిచ్చు యోహాననబడెను. బాప్టిస్టు సంఘాలకు యోహానుకు యేమీ సంబంధము లేదు. యోహాను తరువాత 1500 సంవత్సరముల వరకు బాప్టిస్టు డినామినేషన్ ఉద్భవించలేదు! బాప్తిస్మమివ్వడం అతనిపని, యేసుతో పోల్చుకొనుచు, "ఆయన హెచ్చవలసి యున్నది, నేను తగ్గవలసి యున్నది" యని అతడు చెప్పాడు (యోహాను 3:30). యోహాను యిచ్చిన బాప్తిస్మము యొక్క విధానము గమనించదగినది. విస్తారమైన నీళ్ళున్నచోట అతడు బాప్తిస్మ మిచ్చుచుండెను "సలీము దగ్గర ఐనోనను స్థలమున నీళ్లు విస్తారముగా ఉండెను గనుక యోహాను కూడ అక్కడ బాప్తిస్మమిచ్చుచుండెను" (యోహాను 3:23). అనేకులు అతని యొద్దకు వచ్చి బాప్తిస్మము పొందు చుండిరి (మత్తయి 3:5-6). "అంతట

యూదయ దేశస్థులందరును యెరూషలేము వారందరును బయలు దేరి అతని యొద్దకు వచ్చి తమ పాపములు ఒప్పుకొనుచు యోర్దానునదిలో అతనిచేత బాప్తిస్మము పొందుచుండిరి" (మార్కు 1:5).

నీటిలో ముంచబడుట యూదులకు క్రొత్త యేమియుకాదు. యెరూషలేము దేవాలయము చుట్టు అనేక నీటి మంటపము లుండేవి. దేవాలయ కార్యక్రమములలో పాలుపొందేవారందరు ముందు అనీటిలో మునిగి లోపలికి వెళ్లేవారు. నీటిలో ముంచబడకుండా దేవాలయములోనికి ప్రవేశము లేదు.

యోహాను యాజకధర్మము నిర్వర్తించు లేవీ గోత్రపువాడు, అతడు బాప్తిస్మమును ప్రకటించెను (లూకా 1:6,13; 3:3). అతడు ఒక పట్టణములో గాక, అరణ్యములో ప్రకటించుచుండెను. ఒకే ఒక్కసారి అమలులో యున్నది అతచ్చిన బాప్తిస్మము. ఒకడు తనకుతానే మునుగుట కంటే ముంచడము పొందుటకు యోహాను దగ్గరకు వెళ్లవలసి వచ్చెను. ఎవ్విధమైన రక్తబలి లేకుండా పాపక్షమాపణ కొరకు అతడు బాప్తిస్మ మిచ్చుచుండెను. అయినను ఒకడు తన పాపములు ఒప్పు కొనుచు యోహాను దగ్గర బాప్తిస్మము పొందు చుండెను. యోహాను రెండు సంగతులు కోరెను మారుమనస్సు, మరియు తన వెనుకవచ్చు వాని యందు (మెస్సీయా యందు) విశ్వాసము. యివి లేకుండా అతని యొద్దకు వచ్చు వానికి ప్రయోజనము యేమియు లేకుండెను (మత్తయి 3:7-12).

యేసు యోహాను దగ్గరకు ఒకే ఒక్క కారణము వలన ప్రయాణము చేసెను. యోహాను అజ్ఞాపించే దానికి లోబడుటయే ఆయన ముఖ్యోద్దేశ్యము. ఎందుకు? యోహాను కాదు గాని యేసు దేవుని కుమారుడు. యేసు సృష్టి కర్త, యోహాను సృష్టము. రాబోవు చున్నవాడు యోహాను కాదు, గాని యేసు అయితే యేసు ఎందుకు అతని దగ్గర తగ్గించుకోవాలి ?

యోహాను యొక్క పరిచర్యలో ప్రవచన పూర్వకముగా వాగ్దానము చేయబడిన రక్షణ ఇశ్రాయేలీయులకు మొదలిడెనను గ్రహింపు అతని బాప్తిస్మము ఫలన కలిగెను (మత్తయి 11:13; లూకా 1:76-79; 3:3). అయితే యేసుకు ఏపాపమును లేదు. అయినను అతని బాప్తిస్మము ఆయన కెట్లు వర్తించును?

మొదటిగా యోహాను యొక్క పరిచర్యకు సర్వశక్తిగల దేవుడే అధికారమునను గ్రహించెను. ఇశ్రాయేలీయులు బాప్తిస్మము పొందవ లెననునది దేవుని యొక్క అజ్ఞయై యుండెను. యేసు ఇశ్రాయేలీయుడే

గనుక, ఆయన కూడ యోహాను యొక్క పరి చర్యకు తలొగ్గవలసినదే. అట్లు చేయక పోతే దేవుని యొక్క సంకల్పమును నిరాకరించినట్లేయగును (మత్తయి 3:15; లూకా 7:29-30).

రెండవదిగా, రాబోవు రక్షకుని కొరకు ప్రజలను యోహాను సిద్ధపరచ వలసియుండెను (మత్తయి 3:3; మార్కు 1:1-3). ఈమెస్సీయ యోహాను పనిని నిర్లక్ష్యము చేస్తే, అతని పనిని ఒప్పుకొన లేనట్లగును.

చివరిగా, యోహాను మెస్సీయను ఇశ్రాయే లుకును లోకమునకును అతని యొక్క పరిచర్య వలన బయలు పరచవలసి యుండెను (లూకా 3:4-6; యోహాను 1:31). ఇక్కడ యేసు పరిశుద్ధాత్మతో అభిషేకించబడి, వాగ్దానముచేయబడిన రక్షకుడు (మెస్సీయ) ఈయనేయని అందరికీ నిరూపించబడెను (మత్తయి 3:16; అపొ.కా. 10:37,38).

అయినను యేసు శరీరధారి యైన దేవుడు. ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు, రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు. ఆయన జన్మించగా దేవదూతలు ఆయననారాధించిరి (లూకా 2:13,14; హెబ్రీ 1:6). అయినను సరే ఆయన తన్నుతాను తగ్గించుకొని అకష్టతరమైన ప్రయాణముచేసి, పాపియైన మానవునికి లోబడి, అతని చేతులలో 'పాపములు క్షమించబడే' సందర్భములో బాప్తిస్మము పొందుటకు సిద్ధపడి వచ్చెను. యేసు తన పనిని పూర్తిగా గ్రహించుకొని ఈవిషయంలో మనతో సమానునిగా చేసికొనెను (ఫిలిప్పీ 2:5-11). అందుకే తండ్రియైన దేవుడు ఆకాశము నుండి నోరు తెరచి "ఇదిగో, ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు ఆనం దించుచున్నానని" గంభీరముగా ప్రకటించెను (మత్తయి 3:17).

యోహాను యొక్క పని ముగించ బడెను. దాని విషయమై మనం గజిబిజి అవ్వనక్కర్లేదు. అతని కృషి నేరవేర్చ బడెను. నేడు ఎవరైనా అతని వలనైన బాప్తిస్మము పొందినట్లయితే అది వ్యర్థము (అపొ.కా. 19:1-7). అయినను క్రీస్తు యొక్క పనిని మనం పూర్తిగా గ్రహించు కోవాలంటే యెూహానుతో మనం ఆరంభించాలి. సువార్త లేఖకులు కూడ యోహాను పరిచర్యతో ఆరంభిస్తారు. దేవుని రక్షణ సంకల్పములో అతని పాత్రను మనము సంకుచితము చేయలేము. యేసు యొక్క మాదిరి దానిని మనకు నిరూపించుచున్నది.

- టి.జె. వీలర్

# సంక్షిప్త వార్తలు

2013 సెప్టెంబరు 15,16 తేదీలలో కృష్ణాజిల్లా పరిటాల గ్రామములో యున్న క్రీస్తు సంఘము తమ 27వ వార్షికోత్సవమును ఘనముగా జరుపుకొనిరి. 15వతేది ఆదివారం సహోదరుడు యం. రవికుమార్ (ఫెర్రి)గారు, యం. ప్రసంగి (గుంటూరు) గారును వాక్యపరిచర్య చేయగా సహో. మురుగుల రాజేంద్ర కుమార్‌గారు అధ్యక్షత వహించిరి. 16వ తేదీ సోమవారం సోదరులు డి.ఎస్ నెల్సన్‌గారి ప్రార్ధనతో కూటము ఆరంభముకాగా సోదరులు జాషువాగూటం మరియు టి. అబ్రాహామ్‌లింకన్ (ఏలూరు) గార్లు చక్కటి వాక్య పరిచర్యచేసిరి. జాషువాగారు సతీసమేతముగా హాజరవగా స్థానిక సంఘస్థులందరు సంతోషించిరి. హాజరైన పలువురు సువార్తికులను పరిటాలక్రీస్తు సంఘము దశ్శాలువలతో ఘనముగా సత్కరించిరి. కూటమునకుహాజరైన వారందరికీ మంచి భోజనవిందు నేర్పాటుచేసిరి. పరిటాలలో సహోదరులు మురుగల రాజేంద్రకుమార్‌గారు 27 సంవత్సరములుగా క్రీస్తు పనిని నమ్మకముగా జరిగించుచున్నారు. పరిటాల క్రీస్తుసంఘము నిమిత్తమును కృష్ణాజిల్లా అంతటిలో జరుగుచున్న సువార్త పని నిమిత్తమును చదువరులు ప్రార్థనలలో జ్ఞాపకముంచుకొన మనవి.

2013 సెప్టెబంరు 16వ తేదీ రాత్రి కృష్ణాజిల్లా వెల్వడం గ్రామములో జరిగిన సువార్త కూటములో జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై చక్కటి వాక్య పరిచర్యచేసిరి. యేసుదేవుడెట్లయి యున్నారో చక్కగా విశదపరచిరి, ఈమధ్య కొందరు అబద్ధబోధకులు యేసు దేవుడు కాదని చెప్పుచున్నరాని అక్కడ స్థానికులు ఆందోళన చెందుచుండగా ఆ అబద్ధబోధను ఖండిస్తు జాషువాగారు చక్కగా వాక్యమును బోధించిరి. సోదరులు ఓర్సు ఆదాముగారు కూడ మంచి హెచ్చరికలనిచ్చి సంఘమును బలపరచిరి. వెల్వదం గ్రామములో మూడుదశబ్ధముల క్రితము సోదరులు టి. ప్రసాద రావుగారు సువార్త ప్రకటించి మంచి స్థానిక సంఘమును నెలకొల్పగలిగిరి. అయన మరణానంతరము సోదరులు యేసు బాబుగారు అక్కడ నమ్మకముగా పనిచేయుచు వెల్వదం క్రీస్తు సంఘమును ముందుకు నడుపుచున్నారు.

2013 సెప్టెంబరు 17వ తేదీ మంగళవారం కృష్ణాజిల్లా నూజివీడులో జరిగిన సువార్తికులసహవాస కూటమునకు సోదరులు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై, యేసుప్రభువును సద్దూకయ్యులు అడిగిన "పునరుత్థానమందు అమె ఎవరికి భార్యగా యుండును ?" (మత్తయి 22:27-28) అను ప్రశ్నపై ఆధారపడిమంచి వాక్యపరిచర్య చేసిరి. తదుపరి ఓర్సు ఆదాము గారు కూడ వాక్యపరిచర్య చేసిరి, నూజివీడు పాత పేటలో ఓర్సు ఆదాము గారి ద్వారా జరుగుచున్న మంచి పనిని గూర్చి ప్రభువుకు స్తోత్రములు.

2013 నవబంరు 6,7,8 తేదీలలో కాకినాడలో బైబిల్ లెక్చర్‌షిప్ జరుగును. గాని చదువరులు దానికి హాజరు కావలెనని మానవి.

# మీకొకగొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్బీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.


## Satya Vani

#7-9-35, Sambamurth Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722



RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004